Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL:2024/86143

Associate Editor : K L Krishnam Raju | Volume : 6 | issue: 200 | Thusday : 17.07.2025 | Price : 3/- | Pages : 4

అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణం రాజు | సంపుటి : 6 | సంచిక :200 | గురువారం 17 జూలై 2025 | వెల : 3 | పేజీలు : 4


WANTED

స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

సంప్రదించండి సెల్ : 9440815774


# బనకచర్లతో ఎగువ రాష్ట్రాలకు ఎలాంటి నష్టం ఉండదు



- దిల్లీలో సమావేశమైన తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు
- గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు అనుసంధానం సింగిల్ పాయింట్ అజెండాను ప్రతిపాదించిన ఏపీ..
- సముద్రంలో వృథాగా కలిసే జలాలనే వినియోగిస్తామని వివరించింది
- ఈ సందర్భంగా గోదావరిలో వందేళ్ల సరాసరి ప్రవాహాల గణాంకాలను పేర్కొంది
- ఏటా 3వేల టీఎంసీలు సముద్రంలో కలుస్తున్నాయని తెలిపింది
- బనకచర్ల ద్వారా గరిష్ఠంగా 200 టీఎంసీలే తరలిస్తామని వివరించింది.

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, దిల్లీ:**

తెలుగు రాష్ట్రాల మధ్య ఉన్న జల అంశాలపై చర్చించేందుకు ఏపీ, తెలంగాణ సీఎంలు భేటీ అయ్యారు. దిల్లీలోని శ్రమశక్తి భవన్‌లో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ ఆధ్వర్యంలో ఏపీ సీఎం చంద్రబాబు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. భేటీ ప్రారంభంలో సీఆర్ పాటిల్‌తో పాటు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి పరస్పరం కరచాలనం చేసుకున్నారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు అనుసంధానం సింగిల్ పాయింట్ అజెండాను ఏపీ.. 13 అంశాలను తెలంగాణ ప్రతిపాదించాయి. ఇరు రాష్ట్రాల ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం అజెండాలో చేర్చింది. ఈ భేటీకి ఏపీ, తెలంగాణ జలవనరుల శాఖ మంత్రులు నిమ్మల రామానాయుడు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఇరు రాష్ట్రాల సీఎస్‌లు, జలవనరుల శాఖ కార్యదర్శులు, ఇంజినీర్లు హాజరయ్యారు. సమావేశానికి ముందు ఆయా రాష్ట్రాల అధికారులతో ఇరువురు సీఎంలు సమావేశమయ్యారు. భేటీలో లేవనెత్తాల్సిన అంశాలు, సాంకేతికంగా ఇవ్వాల్సిన సమాధానాలపై చర్చించారు. సీఎంలు తమ అధికారిక నివాసాల్లో సుమారు - మిగతా3లో



## ఈ నెల 21 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

- ఎనిమిది బిల్లులను ప్రవేశపెట్టనున్న కేంద్రం..!
- మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనకు సంబంధించిన బిల్లు సైతం
- మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను పొడిగించాలని ప్రభుత్వం పరిశీలిస్తోంది
- ప్రస్తుతం ఈ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలనను తొలగించే ఉద్దేశం కేంద్రానికి లేదని తెలుస్తోంది

# బనకచర్లపై చర్చ జరగలేదు

- ఆ కమిటీ నివేదిక మేరకు తదుపరి చర్యలు ఉంటాయి
- కృష్ణా, గోదావరి జలాల అంశంలో ఉన్న సమస్యలపై చర్చించడానికి అధికారులు, ఇంజినీర్లతో కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించాం
- గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు కడతామన్న ప్రతిపాదన చర్చకు రాలేదు
- అజెండాలో వారు కడతామనే ప్రతిపాదనే చర్చకు రానప్పుడు ఆపాలన్న చర్చే ఉండదు



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, న్యూఢిల్లీ**

తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా, గోదావరి జలాల అంశంలో ఉన్న సమస్యలపై చర్చించడానికి అధికారులు, ఇంజినీర్లతో కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆ కమిటీ నివేదిక మేరకు తదుపరి చర్యలు ఉంటాయన్నారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కేంద్ర జలశక్తిశాఖ నిర్వహించిన సమావేశం అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో ఏపీ ప్రభుత్వం నుంచి గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు కడతామన్న ప్రతిపాదన చర్చకు రాలేదని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. అజెండాలో వారు కడతామనే ప్రతిపాదనే చర్చకు రానప్పుడు ఆపాలన్న చర్చే ఉండదన్నారు. ఇది అపెక్స్ కమిటీ భేటీ కాదని చెప్పారు. "తెలంగాణ హక్కులను కేసీఆర్ గతంలో ఏపీకి ధారాదత్తం చేశారు. ఆయన చేసిన తప్పులను సరిదిద్దే - మిగతా3లో



## సీఎం రేవంత్ క్షమాపణ చెప్పాలి

- భారత రాష్ట్ర సమితి నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు
- బనకచర్ల ప్రాజెక్టు, ఇతర అంశాల పరిష్కారానికే కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు.
- "రాష్ట్రంలో భాజపా, తెదేపా రిమోట్ పాలన కొనసాగుతోంది
- కమిటీ నిర్ణయాన్ని అంగీకరిస్తామని సీఎం రేవంత్ చెప్పడం సబబు కాదు
- బనకచర్లపై కేంద్రం భేటీయే తప్పు.. సీఎం పాల్గొనడం మరో తప్పు.



## బెంగాలీల పట్ల బీజేపీ వైఖరికి సిగ్గుపడుతున్నా

- పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ
- బెంగాలీ మాట్లాడే వారందరినీ బంగ్లాదేశీ రోహింగ్యాలు అని బీజేపీ పిలుస్తున్నది
- రోహింగ్యాలు మయన్మార్‌లో నివసిస్తారు
- పశ్చిమ బెంగాల్ పౌరులందరికీ సరైన గుర్తింపు కార్డులు, గుర్తింపు ఉన్నాయి



## గల్వాన్ ఘర్షణల తర్వాత తొలిసారి.. చైనా పర్యటనకు మోదీ..!

భారత్-చైనా మధ్య స్తంభించిన దౌత్య సంబంధాలను పునరుద్ధరించేందుకు ప్రయత్నాలు

వచ్చే నెలలో జరిగే ఎస్‌సీఓ సదస్సుకు ప్రధాని హాజరుకానున్నట్లు సమాచారం.

ఈమేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో కథనాలు

# రేవంత్ గుట్టు రట్టయ్యింది

- రేవంత్‌లా దొంగలు, లంగలు...
- కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు!
- రేవంత్‌కు దమ్ముంటే.. కూలిందంటున్న మేడిగడ్డ బ్యారేజి మీదనే చర్చ పెడదాం
- "కోవర్టులెవరో, తెలంగాణ కోసం కొట్లాడిందెవరో తేలిపోయింది.
- ఒక్క బొట్టు నీరు అక్రమంగా అప్పజెప్పినా పోరాటం తప్పదు
- తెలంగాణను పీక్కుతింటున్న రాబందుల పని పడతాం"
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్**

సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి 48వ ఢిల్లీ పర్యటన గుట్టురట్టయ్యిందన్న కేటీఆర్.. ముసుగు వీడింది.. నిజం తేటతెల్లమయ్యిందన్నారు. "నిధులు రాహుల్ గాంధీకి.. నీళ్లు చంద్రబాబుకి.. బనకచర్ల గురించి చర్చే రాలేదని బుకాయిస్తున్నారు. గురుదక్షిణగా గోదావరి జలాలను అప్పజెప్పడానికేనా?. నువ్వు గద్దెనెక్కింది" అంటూ ఎక్స్ వేదికగా రేవంత్‌పై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "కోవర్టులెవరో, తెలంగాణ కోసం - మిగతా3లో



# ప్రశ్నిస్తే కేసులు.. దాడులు

- 'ప్రభుత్వ మోసాలపై 21 నుండి ఇంటింటికి..
- విలేకరుల సమావేశంలో జగన్మోహన్‌రెడ్డి

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

ప్రతిపక్ష పార్టీగా రాష్ట్రంలోని సమస్యలపై ప్రశ్నిస్తుంటే కేసులు బనాయిస్తున్నారని, దాడులకు పాల్పడుతున్నారని మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కార్యాలయంలోబుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ పార్టీకి చెందిన కీలక నేతలందరిని ఏదోఒక పేరుతో కేసులు పెట్టి అరెస్ట్‌లు చేస్తున్నారని చెప్పారు. డిజి స్థాయి పోలీసు అధికారులపైనా కేసులు పెట్టి వేధిస్తున్నారని అన్నారు. వేధింపులు తట్టుకోలేక యువ ఐపిఎస్‌లు రాజీనామా చేసి పోతున్నారని అన్నారు. పార్టీ కార్యక్రమానికి వెళుతున్న కృష్ణాజిల్లా జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఉప్పాల హారికపైనా, నెల్లూరు జిల్లాలో మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిపైనా పోలీసుల సమక్షంలోనే దాడులు జరిగాయని తెలిపారు. దాడులు, దౌర్జన్యాలు, కేసులతో చంద్రబాబు అనుసరిస్తున్న ఈ విధానం ఇప్పుడు విత్తనంగానే ఉన్నా, భవిష్యత్తులో చెట్టు అవుతుందని అన్నారు. ప్రభుత్వం మారిన తరువాత ఇప్పుడు వేధింపులు చేస్తున్న వారందరి సంగతి చూస్తామని, వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తామని హెచ్చరించారు. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరిస్తూ ఈ నెల 21వ తేది నుండి ఇంటింటికి ప్రచార కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు చెప్పారు. - మిగతా3లో

Cell: 9440352030 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం
చిత్తూరు ఎక్స్‌ప్రెస్
APTEL/2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక



## బనకచర్లతో ఎగువ రాష్ట్రాలకు
# ఎలాంటి నష్టం ఉండదు

-మొదటిపేజీ తరువాయి

గంటన్నరపాటు సీఎస్‌లు, నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులతో సమీక్షించారు.

**బనకచర్లతో ఎగువ రాష్ట్రాలకు ఎలాంటి నష్టం ఉండదు: ఏపీ**

గోదావరి–బనకచర్ల ప్రాజెక్టు అనుసంధానం సింగిల్ పాయింట్ అజెండాను ప్రతిపాదించిన ఏపీ.. ఈ ప్రాజెక్టు లక్ష్యాలను నివేదిక రూపంలో సమర్పించింది. సముద్రంలో వృథాగా కలిసే జలాలనే వినియోగిస్తామని వివరించింది. ఈ సందర్భంగా గోదావరిలో వందేళ్ల సరాసరి ప్రవాహాల గణాంకాలను పేర్కొంది. ఏటా 3వేల టీఎంసీలు సముద్రంలో కలుస్తున్నాయని తెలిపింది. బనకచర్ల ద్వారా గరిష్ఠంగా 200 టీఎంసీలే తరలిస్తామని వివరించింది. ఈ ప్రాజెక్టు వల్ల ఎగువ రాష్ట్రాలకు ఎలాంటి నష్టం ఉండదని..11 ఏళ్లుగా తెలంగాణలో కట్టిన ఏ ప్రాజెక్టుకూ అభ్యంతరం చెప్పలేదని పేర్కొంది. దిగువ రాష్ట్రంగా తమ చర్యలను తెలంగాణ, కేంద్ర ప్రభుత్వం అర్థం చేసుకోవాలని కోరింది.

**తెలంగాణ ప్రతిపాదించిన 13 అంశాలివే..**

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, డిండి ఎత్తిపోతల పథకానికి అనుమతులు ఇవ్వాలి.

శ్రీశైలం నుంచి వేరే బేసిన్‌కి ఆంధ్రప్రదేశ్ నీటి తరలింపు పనులను వెంటనే ఆపేయాలి

ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రారంభించిన ప్రాజెక్టులకు సహకరించేలా కృష్ణా ట్రైబ్యునల్‌లో మద్దతుగా వాదించేలా ఏపీని ఒప్పించాలి




కృష్ణానదీ జలాలను వేరే బేసిన్‌కు తరలించకుండా కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు చర్యలు తీసుకునేలా ఆదేశించాలి. కృష్ణా జలాలను అక్రమ తరలింపును అడ్డుకునేందుకు టెలిమెట్రీలను ఏర్పాటు చేసేందుకు ఏపీ అంగీకరించాలి.

తుంగభద్ర బోర్డు నీటి తరలింపుపై చర్చించాలి.

రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పథకంపై ఎన్జీటీ ఉత్తర్వులను అమలు చేసే విధంగా కేంద్ర జలశక్తి శాఖ చర్యలు తీసుకోవాలి. ఈ పథకంపై చట్టపరంగానే ముందుకు వెళ్లాలి.

శ్రీశైలం కుడి కాలువ ద్వారా ఎక్కువ నీటి తరలింపును నియంత్రించాలి.

శ్రీశైలం ప్రాజెక్టులో కొత్త ప్రాజెక్టులు హంద్రీనీవా, వెలిగొండ, గురు రాఘవేంద్ర నిర్మాణాలను నియంత్రించాలి.

శ్రీశైలం డ్యాం సేఫ్టీకి తగిన చర్యలు తీసుకోవాలి.

శ్రీశైలం నుంచి నీటి తరలింపు ద్వారా విద్యుత్ ఉత్పత్తికి తీవ్ర విఘాతం కలుగుతోంది.. దీనిని అడ్డుకోవాలి.

పోలవరం ప్రాజెక్టు తరహాలోనే ఇచ్చంపల్లి ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వాలి.


ఇచ్చంపల్లి నుంచి కావేరికి గోదావరి జలాల తరలింపుకు మేము సిద్ధం. అందులో 200 టీఎంసీల నీటిని వాడుకునేందుకు అనుమతులు ఇవ్వాలి.

సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వాలి.

ప్రాణహిత–చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టుకు ఏఐబీపీ కింద నిధులు ఇవ్వాలి. మహారాష్ట్ర ప్రభుత్వంతో కేంద్ర ప్రభుత్వమే చర్చలు జరిపి తుమ్మిడి హట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణానికి సహకరించాలి.

# గ్రేటర్‌లో మూడు నియోజకవర్గాల్లో ఎన్నికలు

**హైదరాబాద్ :** లంగాణ రాజకీయం ఫుల్ హీట్ మీదుంది. నువ్వానేనా..తగ్గేదేలే అంటూ అధికార కాంగ్రెస్, అపోజిషన్ బీఆర్ఎస్ సవాళ్లు, ప్రతిసవాళ్లు..విమర్శలతో పొలిటికల్ వార్‌ను నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్తున్నాయి. ఇదే టైమ్‌లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు పార్టీలు రెడీ అవుతున్నాయి. మాగంటి గోపినాథ్ సతీమణి సునీతను బరిలోకి దింపాలని గులాబీ పార్టీ ఆల్రెడీ డిసైడ్ అయిందంటున్నారు.ఇప్పటికే గ్రౌండ్‌లో పరిస్థితులను అంచనా వేయడానికి సర్వే కూడా చేయించినట్లు తెలుస్తోంది. అయితే జూబ్లీహిల్స్‌తో పాటు గ్రేటర్‌లో మరో రెండు బైపోల్స్ రాబోతున్నాయన్న టాక్ ఊపందుకుంది. ఖైరతాబాద్ అసెంబ్లీ సీటుకు కూడా ఉప ఎన్నిక రావొచ్చన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. బీఆర్ఎస్‌లో గెలిచి..కాంగ్రెస్‌లో చేరి..హస్తం పార్టీ సింబల్ మీద ఎంపీగా కంటెస్ట్ చేసిన దానం నాగేందర్‌పై అనర్హత వేటు పడటం ఖాయమన్న చర్చ జరుగుతోంది. ఈ నెల 18 తర్వాత ఎప్పుడైనా కోర్టు తీర్పు రావొచ్చంటున్నారు.ఈ నేపథ్యంలోనే అనర్హత వేటు పడే కంటే ముందే రాజీనామా చేయాలనే ఆలోచనలో దానం ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది. అయితే మంత్రి పదవి ఇస్తానంటే..జూబ్లీహిల్స్‌లో పార్టీని గెలిపిస్తా..తాను రిజైన్ చేసి ఖైరతాబాద్‌లో మళ్లీ గెలుస్తానని దానం కండీషన్ పెడుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే వారం రోజుల్లోపే దానం నాగేందర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తారని అంటున్నారు. నెలాఖరులో జరిగే మంత్రివర్గ విస్తరణలో ఆయనకు చోటు దక్కడం పక్కా అని..మినిస్టర్ హోదాలోనే ఆయన ఎమ్మెల్యే ఎన్నికల్లో పోటీ చేస్తారని కూడా గాంధీభవన్ వర్గాల ఇన్ సైడ్ టాక్.దానం రిజైన్ చేస్తే గ్రేటర్‌లో రెండు బైపోల్స్ పక్కా. అదీ కూడా పక్క పక్క నియోజకవర్గాల్లోనే ఎన్నికలు జరగనున్నాయి. ఇదే క్రమంలో ఎమ్మెల్యే రాజాసింగ్ ఎపిసోడ్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్..బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవికి నామినేషన్ సందర్భంగా రాజీనామా చేయడం దుమారం లేపింది. ఇప్పుడు ఆయన రిసిగ్నేషన్‌ను పార్టీ హైకమాండ్ ఆమోదించడంతో రాజాసింగ్ ఎమ్మెల్యే పదవికి కూడా రిజైన్ చేస్తారన్న టాక్ వినిపిస్తోంది. బీజేపీ నేతలు కూడా రాజాసింగ్ రాజీనామా చేయాలన్న డిమాండ్లు తెస్తున్నారు.అవసరమైతే అనర్హత వేటు కోసం స్పీకర్‌కు కంప్లైంట్ చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. రాజాసింగ్



కూడా ఎమ్మెల్యే పదవికి రిజైన్ చేయాలని భావిస్తున్నారట. అదే జరిగితే గ్రేటర్ హైదరాబాద్‌లో మూడు బైపోల్స్ రావడం పక్కా. అటు దానం..ఇటు రాజాసింగ్ జూబ్లీహిల్స్ బైపోల్ నోటిఫికేషన్ వచ్చే కంటే ముందే రిజైన్ చేస్తే..మూడు బైపోల్స్‌కు ఒకేసారి నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది. అటు దానం..ఇటు రాజాసింగ్ డెసిషన్ తీసుకుంటే మాత్రం.. భాగ్యనగరం వేదికగా మినీ దంగల్ పక్కా.ఇదే జరిగితే పార్టీల వ్యూహాలు, ప్రతివ్యూహాలు ఎలా ఉండబోతున్నాయనేది ఇంట్రెస్టింగ్‌గా మారింది. అంతేకాదు ఒకేసారి మూడు బైపోల్స్ అంటే చిన్న విషయం కాదు. అన్నీ పార్టీలకు ప్రెస్టేజ్‌కా సవాల్. ఇందులో బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాలు రెండు..బీజేపీది ఒకటి. ఇప్పటికే గ్రేటర్‌లో సికింద్రాబాద్ కంటోన్మెంట్ బైపోల్‌లో గెలిచిన కాంగ్రెస్..మూడు సీట్లకు ఉప ఎన్నికలు వస్తే మాత్రం ప్రతిష్టాత్మకంగా తీసుకునే అవకాశం ఉందిఇక రాజాసింగ్ విషయానికొస్తే బీజేపీ అధిష్టానం తన రాజీనామాను ఆమోదిస్తుందని ఆయన ఊహించలేదట. తన వెర్షన్ విని..అంతా సెట్‌రైట్ చేస్తారని భావించారట. అయితే రాజీనామా ఆమోదంతో..రాజాసింగ్ మహారాష్ట్ర రాజకీయాల్లోకి వెళ్లడం పక్కా అన్న టాక్ వినిపిస్తోంది. మహారాష్ట్రలోని ఉద్ధవ్ శివసేనలో చేరి..ఆ పార్టీ తెలంగాణ అధ్యక్షుడిగా ఉంటూ..అక్కడ..ఇక్కడ పాలిటిక్స్ చేయాలనేది రాజాసింగ్ వ్యూహమట.లేకపోతే మహారాష్ట్రలోనే యాక్టీవ్ పాలిటిక్స్‌లో ఉండాలనేది రాజాసింగ్ ఆలోచన అని కూడా చెప్తున్నారు. ఈ క్రమంలో గోషామహల్ నుంచి మళ్లీ పోటీ చేసి గెలవాలనే కసితో రాజాసింగ్ ఉన్నా..బీజేపీ ఆయనపై అనర్హత ఫిర్యాదు చేసినా..బైపోల్ రావడం ఖాయం. అదే జరిగితే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలకు ముందే..రాష్ట్ర రాజధానిలో మూడు అసెంబ్లీ సీట్ల ఎన్నికల సమరం పొలిటికల్ హీట్‌ను పెంచనుంది. దానం ఇచ్చిన ఆఫర్‌పై కాంగ్రెస్ ఎలా స్పందిస్తుంది..? ఎమ్మెల్యే పదవికి రాజీనామాపై రాజాసింగ్ ఆలోచనేంటి.? అనేది చూడాలి మరి

# రూట్ మ్యాప్ సిద్ధం చేస్తున్న కమలం

**రంగారెడ్డి :** స్థానిక సంస్థల ఎన్నికలకు భారతీయ జనతా పార్టీ సమాయత్తం అవుతోంది. ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు దక్కించుకోవడమే లక్ష్యంగా నాయకులను, శ్రేణులను సంసిద్ధులను చేయడానికి రంగం సిద్ధం చేసిం ది. ఈమేరకు మంగళవారం మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధి అవుషాపూర్‌లో రాష్ట్ర పదాధికారులతో ప్రత్యేక వర్క్ షాపు నిర్వహించింది.బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి పార్టీ జాతీయ కార్యదర్శి సునీల్ బన్సల్ ముఖ్య అతిథిగా వచ్చారు. వర్క్‌షాపునకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి అభయ్‌పాటిల్, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికల కార్యాచరణ తేదీల వారీగా ప్రకటించారు.ఈనెల 18 నుంచి ఆగస్టు 20వరకు వరుసగా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చి నామినేషన్లు వేసిన తర్వాత తదుపరి కార్యక్రమాలకు రూపకల్పన చేయనున్నారు. అంతకుముందు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ మాదిరిగానే, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా



అదే అవినీతి, ప్రజావ్యతిరేక పాలనను కొనసాగిస్తోందని విమర్శించారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా తాను నల్లగొండ, సూర్యాపేట, కోదాడ ప్రాంతాల్లో మొట్టమొదటి పర్యటన చేశానని, ఈపర్యటనలో వివిధ వర్గాల ప్రజలను కలిసి నట్లు తెలిపారు. గ్రామాల్లో బీజేపీ బలం పెరుగుతోందని, ప్రజలు బీజేపీ ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు.గతంలో భారతీయ జనతా పార్టీకి ఒక్క ఎమ్మెల్యే, నలుగురు ఎంపీలు మాత్రమే ఉండగా, ఇప్పుడు ఏడుగురు ఎమ్మెల్యేలు, ఎనిమిది మంది ఎంపీలు, ముగ్గురు ఎమ్మెల్సీలు ఉన్నారని, ప్రతీ ఎన్నికలో బీజేపీ ఓటుశాతం, ప్రాతినిధ్యం పెరుగుతోందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలిచేలా విజయసంకల్పంతో ముందుకు సాగాలని, అందుకుకార్యకర్తలు, నాయకులు ముందుకు రావాలని, అందరం కలిసిమెలిసి ముందుకు నడవాలని పిలుపునిచ్చారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు అందులో 10 శాతం మతపరమైన రిజర్వేషన్లను కలుపాలని చూస్తోందని ఇది బీసీలకు వ్యతిరేకమైన చర్య ఉన్నారు. మతపరమైన కారణాల వల్లే ఆనాడు భారతదేశ విభజన జరిగిందన్న విషయాన్ని గుర్తుచేశారు.విద్యా, ఉద్యోగాల్లో మతపరమైన 4 శాతం రిజర్వేషన్లను బీజేపీ గతంలోనే వ్యతిరేకించిందని, కానీ కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు రాజకీయం కోసం ఇప్పుడు రాజకీయాల్లోనూ అదే విధానాన్ని కొనసాగిస్తోందన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని, ప్రజల కోసం పోరాటం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలిచేలా ఇప్పటినుంచే కృషి చేయాలన్నారు.

## బనకచర్లపై చర్చ జరగలేదు

-మొదటిపేజీ తరువాయి

ప్రయత్నం చేస్తున్నాం. పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఈ సమావేశం జరిగింది. ఈ భేటీలో కేంద్ర ప్రభుత్వం కేవలం నిర్వాహక పాత్రే పోషించింది. కేంద్రం ఎవరివైపూ మాట్లాడలేదు. భేటీలో తీసుకున్న నిర్ణయాలన్నీ తెలంగాణ విజయమే. అనుమానించుకుంటూ పోతే ముందుకు సాగలేం. సమస్యలను పరిష్కరించుకునేందుకే ఉన్నాం.. గొడవలు పెట్టుకునేందుకు కాదు. ఇరు రాష్ట్రాలు గొడవలు పెట్టుకోవాలని కొందరు చూస్తున్నారు. వివాదాలు లేకుండా సమస్యలను పరిష్కరించుకోవడమే మా అజెండా”అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

**టెలీమెట్రీల ఏర్పాటుకు ఏపీ అంగీకారం: మంత్రి ఉత్తమ్**

అంతకుముందు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. అన్ని రిజర్వాయర్లు, కెనాల్స్ వద్ద యుద్ధప్రాతిపదికన టెలీమెట్రీలు ఏర్పాటు చేసేందుకు ఏపీ ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. “కృష్ణా నదీజలాల వాడకం లెక్కలపై అనుమానాలున్నాయి. టెలీమెట్రీలు ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరాం. కేంద్రం నిధులు ఇవ్వకపోయినా రాష్ట్రమే నిధులు కేటాయిస్తుందని చెప్పాం. వీటి ఏర్పాటుపై గత ప్రభుత్వం అలసత్వం ప్రదర్శించింది. ఈ భేటీ సందర్భంగా టెలీమెట్రీలు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నాం”అని తెలిపారు.

**జలశక్తి సమావేశంలో కేంద్రం కీలక నిర్ణయాలు**

జలశక్తి సమావేశంలో కేంద్రం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. గోదావరి,కృష్ణా జలాలపై వివాదాలపై పరిష్కరించేలా కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. కేంద్రం ఆధ్వర్యంలో జలవివాదాల పరిష్కార కమిటీని కేంద్రం నియమిస్తుంది. ఈ నెల 21లోగా కమిటీ ఏర్పాటు కానుంది. హైదరాబాద్‌లోని గోదావరి నది బోర్డు,అమరావతిలోనే కృష్ణానది బోర్డు ఉండేలా నిర్ణయం తీసుకుంది. దీంతోపాటు రిజర్వయార్ల ఫ్లో నీటి లెక్కలను గుర్తించేలా టెలిమెట్రీ వ్యవస్థను అందుబాటులోకి తీసుకు వచ్చేలా కేంద్రం నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ సమావేశంపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ‘ఇది కేవలం ఇన్ ఫార్మల్ మీటింగ్ మాత్రమే. నాలుగు అంశాలపై పరిష్కారం దొరికింది. కేసీఆర్ ఇన్నాళ్లు వీటికి పరిష్కారం కనుక్కోలేదు. ఈ సమావేశంలో మేము విజయం సాధించాం. అన్ని ప్రాజెక్టులలో టెలిమెట్రి యంత్రాలు పెట్టేందుకు ఏపీ అంగీకరించడం మా విజయం. చర్చల ద్వారా సమస్యలు పరిష్కారం చేసుకుంటాం..పోరాటం చేయాల్సిన అవసరం లేదు. కృష్ణా, గోదావరిపై ప్రాజెక్టుల అపరిష్కృతంగా ఉన్న అన్ని అంశాలపై ఇంజనీర్ల కమిటీ ముందడుగు చూపిస్తుంది. వారం రోజుల్లో కమిటీ ఏర్పాటు అవుతుందని తెలిపారు.

# రేవంత్ గుట్టు రట్టయ్యింది

-మొదటిపేజీ తరువాయి

కొట్లాడిందెవరో తేలిపోయింది. ఒక్క బొట్టు నీరు అక్రమంగా అప్పజెప్పినా పోరాటం తప్పదు. తెలంగాణను పీక్కుతింటున్న రాబందుల పని పడతాం” అంటూ కేటీఆర్ హెచ్చరించారు. నీ గురువుపై విశ్వాసం చూపించడానికి తెలంగాణ విధ్వంసం కావలసిందేనా?. ఇంకెందుకు రెండు రాష్ట్రాలు, ఇద్దరు ముఖ్యమంత్రులు?. నిన్ను ఎన్నుకున్న పాపానికి చెరిపేయి సరిహద్దులు! తెలంగాణా మీద నీ అక్కసు చల్లారు తుందేమో!”అంటూ కేటీఆర్ పోస్ట్ చేశారు.తెలంగాణ రాజకీయాల్లో ప్రతిపక్ష, అధికార పార్టీల నడుమ సవాళ్ల పర్వం కొనసాగుతోంది. మరోసారి సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈరోజు తెలంగాణ భవన్‌లో జరిగిన దళిత బంధు సాధనసమితి సమావేశంలో రేవంత్ పై సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌కు దమ్ముంటే.. కూలిందంటున్న మేడిగడ్డ బ్యారేజి మీదనే చర్చ పెడదాం అని.. చర్చకు.. రా అని సవాలు విసిరి చర్చకు వెళితే రేవంత్ రెడ్డి పారిపోయిండని చురకలు అంటించారు. చర్చకు వస్తవా అని పిలిచి పారిపోయిన పిరికి సన్నాసి రేవంత్ రెడ్డి అని సెటైర్లు వేశారు.

**తెలివిలేక కాళేశ్వరాన్ని కూలేశ్వరం...**

మరొకసారి నాగార్జునసాగర్ కట్టపైన చర్చకు వస్తావా అని సవాల్ విసిరిండని.. రేవంత్ రెడ్డికి తెలివిలేక కాళేశ్వరాన్ని కులేశ్వరం అంటున్నారని ఫైరయ్యారు. నాగార్జునసాగర్ కట్టమీద కాదు.. కానీ మేడిగడ్డ బ్యారేజ్ మీద చర్చకు రావాలని సవాలు విసిరారు. తుంగతుర్తి సూర్యాపేట నియోజకవర్గం చివరి మడి వరకు నిలిచిన నాయకుడు కేసీఆర్ అన్న సంగతి రేవంత్‌కు తెలుసునని కేటీఆర్ అన్నారు. ముఖ్యమంత్రి దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారని కేటీఆర్ ఫైరయ్యారు. ఇచ్చిన హామీలు అమలు చేయమంటే.. ‘ఏం చేస్తారో చేసుకోండి నన్ను కోసుకు తింటారా’ అంటూ సీఎం రంకెలు వేస్తున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఏం పీక్కుంటారో పీక్కోండని సీఎం పదేపదే అంటున్నారని.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఏం పీక్కుంటారో చూపిస్తారని కేటీఆర్ చురకలంటించారు.

**మాకు ఇష్టం లేదు...**

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం రాసినప్పుడు రేవంత్ రెడ్డి లాంటి దొంగలు, లంగలు పదవుల్లోకి వస్తారని ఊహించలేదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. అందుకే ఐదు సంవత్సరాల పాటు పదవిలో ఉండే విధంగా రాజ్యాంగం రాశారని అన్నారు. లేకుంటే దేశంలో రేవంత్ లాంటి మోసాగాళ్లను రీకాల్ చేసే వ్యవస్థను కూడా ప్రవేశపెట్టేవారని అన్నారు. రాజకీయాల్లో తిట్లు వాడడం తమకు ఇష్టం లేదని చెప్పారు. కానీ రేవంత్ రెడ్డికి ఆయన భాషలో చెప్తేనే అర్థమవుతుందని మాట్లాడాల్సి వస్తుందని.. కుక్క కాటుకు చెప్పు దెబ్బ అన్నట్లు మేము కూడా తిట్లు వాడక తప్పదం లేదని వ్యాఖ్యలు చేశారు.

# ప్రశ్నిస్తే కేసులు.. దాడులు



-మొదటిపేజీ తరువాయి

ఏడాది కాలం నుండి కూటమి ప్రభుత్వం ఒక్క హామీ కూడా నిలబెట్టుకోలేదన్నారు. 18 వేల కోట్ల రూపాయల విద్యుత్ భారం వేశారని అన్నారు. కొన్ని చోట్ల డిఐజిలు మాఫియా డాన్లుగా వ్యవహరిస్తూ ఇసుక, మద్యం, బెల్టుషాపుల నుండి పెద్దఎత్తున వసూళ్లు చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో నెలకొన్న సమ స్యలపై మాట్లాడేందుకు వెళు తుంటే అన్ని చోట్లా టాపిక్ డైవర్షన్ చేయిస్తున్నారని మండిపడ్డారు. సినిమా డైలాగులను పోస్టర్ ప్రదర్శిస్తే 131 మందిపై కేసులు పెట్టారని, అవి తప్పయితే సినిమాలో డైలాగులు తీసేయాలని, సెన్సార్ బోర్డు ఎలా సర్టిఫికెట్ ఇచ్చిందని ప్రశ్నించారు. చిత్తూరులో టిడిపికి చెందిన వారి కంపెనీలు కుమ్మక్కయి మామిడి రైతులకు అన్యాయం చేశాయని, ప్రశ్నించేందుకు వెళుతుంటే ముగ్గురు ఎస్పిలు అడ్డుకున్నారని చెప్పారు. విద్యార్థులకు రూ.6,600 కోట్లు బకాయి ఉందని తెలిపారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన 14 నెలల్లో రూ.1,75,112 కోట్లు అప్పులు చేశారని పేర్కొన్నారు. పాల ధరలు పెంచారని పేర్కొన్నారు.

**ఇండోసోల్‌కు భూములిచ్చాం**

ఇండోసోల్‌కు వైసిపి ప్రభుత్వ హయాంలో భూములిచ్చినట్లు జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఆ భూములను బిపిసిఎల్‌కు ఇవ్వాలని చెబుతూ ఇండోసోల్‌ను తెలుగుదేశం ప్రభుత్వం కరేడుకు పొమ్మంటోందని జగన్ చెప్పారు. బిపిసిఎల్‌కు భూమి ఇవ్వాలనుకుంటే ప్రకాశం జిల్లాలో వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, దాన్ని ఇవ్వొచ్చని, వారికి ఇండోసోల్ కంపెనీ భూమి ఇవ్వాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు.

## రైతులకు యూరియాను ఆర్‌బికేల ద్వారానే అందించాలి.



**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 16:**
రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వ్యవసాయ రైతుల కు యూరియాను అందుబాటులో రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించాలని జాతీయ మానవ హక్కులు, అవినీతి నిర్మూలన సంస్థ జిల్లా అధ్యక్షులు డివి మునిరత్నం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అందులో భాగంగా బుధవారం పలమనేరు పట్టణంలో మానవ హక్కుల కార్యాలయము నందు సరస్వతి అధ్యక్ష తన సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా డివి మునిరత్నం మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు వివిధ రకాలైన రసాయ న ఎరువులు, క్రిమి సంహారక మందులు అందించే వారిని గుర్తుచేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించకుండా గ్రోమోర్ ద్వారా అందించడంతో రైతులు నానా ఇబ్బందు లు పడుతున్నారని గుర్తుచేశారు. యువ జన జిల్లానాయకులు సోమరాజు,కవీశ్వర్ డివిజన్ కార్యదర్శి మణి, ప్రచార కార్య దర్శి నారాయణ శెట్టి,గౌరవ సలహాదారు పార్థసారథి మాట్లాడుతూ గ్రోమోర్ కు వచ్చే అరకొరా ఎరువులు కొంతమంది రైతులకే సరిపోతున్నాయని చాలామంది రైతులకు అందక పడి కాపులు కాయాల్సి న పరిస్థితి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది వర్షాలు సక్రంగా లేక పోవడంతో వ్యవసాయ బోర్లలో వచ్చే తక్కువ నీటికి రెండు ఎకరాలు పంట వేసే రైతు ఒక ఎకరా పంట పండిస్తున్నారని పేర్కొన్నారు. వాటికి కూడా ఎరువులు దుకాణాల్లో లేకపోవడంతో పంటదిగుబడి రాక రైతు అప్పుల పాలవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రైతు భరోసా కేంద్రాలకు యూరి యాతోపాటు, క్రిమిసంహారక మందులు సకాలంలో అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూర శ్రీనివాసులు, వినోద్‌కుమార్ అమ్మానుల్లా, సర్దార్,ఆనంద్, శ్రీనివాసులు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కేసుల్లో పురోగతి సాధించాలి : డి.ఎస్.పి ప్రభాకర్




**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 16:**
వివిధ కేసుల్లో వెంటనే పురోగతి సాధించాలని పలమనేరు డిఎస్పి ప్రభాకర్ సూచించారు. బుధవారం డివిజన్ స్థాయిలో స్థానిక పోలీస్ స్టేషన్లో క్రైమ్ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ వివిధ సమస్యలతో వచ్చేవారిపట్ల మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలన్నారు. ఎస్సీ ఎస్టీ కేసులు ఫోక్సో కేసులు పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సమాజంలో జరుగుతున్న చట్ట వ్యతిరేక విధానాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పలమనేరు డివిజన్ పరిధిలోని ప్రతి పోలీస్ స్టేషన్లో అర్ధ సంవత్సర నేర పరిశోధన కేసులను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో పలమనేరు గంగవరం పుంగనూరు చౌడేపల్లి పరిధిలోని సర్కిల్ ఇన్స్పెక్టర్లు ఎస్సైలు పాల్గొన్నారు.

### సత్యవేడు నియోజకవర్గ అభివృద్ధిపై

# దూకుడు పెంచిన శంకర్ రెడ్డి.

**సత్యవేడు, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 16:**
తెలుగుతమ్ముళ్ల గ్రూపు రాజకీయాలను కట్ చేస్తున్న సత్యవేడు నియోజకవర్గ టిడిపి ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి.తప్పుడు ఆలోచనలు ఉంటే పప్పులో కాలేసినట్టే. పార్టీ పరంగా గ్రూపు లుంటే నాకు నచ్చదు.నాకొంత టైం పట్టొ చ్చు ఏమో గాని, నాతో కలిసి వస్తే కలదు సుఖం సత్య వేడు నియోజకవర్గ తెలుగు దేశంపార్టీనిమళ్లీ పూర్వవైభంలోకి తెస్తున్న శంకర్ రెడ్డి.పార్టీ హై కమాండ్ నిర్ణయంతో ముందు కు వెళ్తా. సత్యవేడు నియోజక వర్గంలో తెలుగుదేశం పార్టీ పూర్వవైభవా నికి తీసుకువస్తున్న సత్యవేడు నియోజక వర్గ టిడిపి ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్. వ్యాపా రవేత్త అనుకున్నారా పప్పులో కాలేసినట్టే రాజకీయంలో కూడా తనకంటూ ఓస్థాయి ట్రాక్ ఉంది దాన్ని ఇంకా దృఢం చేసుకుం టున్నారు. అది రాజకీయ నాయకులు గుర్తించాలి. ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్‌గా బాధ్యతలు తీసుకున్నప్పటినుండి ప్రతి రోజు ఏదో ఓ పల్లెలో దర్శనమిస్తున్న శంకర్ రెడ్డిని గజమాలతో, సాల్వాలతో, హారతులతో ప్రతిఇంట ఘనస్వా గతం పలుకుతున్నారు.తాను తొలి అడుగు కార్యక్రమంలో భాగంగాప్రభుత్వ కార్యక్ర మాలను ముందుకు తీసుకుపోతు అక్క డ ఉన్నటువంటి తెలుగు తమ్ములతో బేధాభిప్రాయాలు లేకుండా విస్తృతస్థాయి సమావేశాలను కూడా నిర్వహి స్తున్నారు. పార్టీ విభేదాలు గాని రాజకీయ గ్రూపులు లేకుండా తన వెంట నడవాలని నాయ కులకు సూచిస్తున్నారు. నాతో నడిచే ప్రతి ఒక్క నాయకునికి కార్యకర్తకి సహాయ సహకా రాలు ఎల్లవేళలా ఉంటాయని



సభాముఖంగా తెలిపారు. అదేవిధంగా నియోజక వర్గంలో జరుగుతున్నటు వంటి తొలిఅడుగు కార్యక్రమంలో ప్రజలు. విన్న విస్తున్నటువంటి సమస్యలు, ప్రతిసమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరి స్తానని తెలిపిన రెండు మూడు రోజుల్లోనే సీఎం ను కలవడం జరిగింది. ప్రజలకు చెప్పిన మాట ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి నియోజకవర్గ సమ స్యలపై వినతిపత్రాన్ని ఇవ్వడం జరిగింది. నియోజకవర్గంలోని నిర్వహిస్తున్నటు వంటి సూపర్ సిక్స్ పథకాలు అమలుపై, పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల దృష్టికి తీసుకెళ్తుంటే వారి ఆనందానికి హద్దులు లేవు. అందులో ముఖ్యంగా రోడ్ల వలన ప్రజలు పడుతున్నటువంటి ఇబ్బందులను వెంటనే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

# ఈ పొరపాట్లు చేస్తే ఫాస్టాగ్‌లు బ్లాక్‌లిస్ట్‌లోకి

వాహన యజమానులు తమ ఫాస్ట్‌ట్యాగ్‌లను విండ్‌స్క్రీన్‌పై సరిగ్గా అతికించకపోవడం వల్ల టోల్ బూత్‌ల వద్ద రద్దీ, తప్పు ఛార్జ్‌బ్యాక్‌లు, టోలింగ్ వ్యవస్థను దుర్వినియోగం చేయడం మొదలైన వాటి ద్వారా ఇది మొత్తం టోలింగ్ వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. చాలా మంది వాహనాలు టోల్‌గేట్ వద్దకు రాగానే ఫాస్టాగ్ పని చేయవు. ఫాస్ట్ ట్యాగ్ మీ కారు విండ్ స్క్రీన్ కు అతికించారా? లేదా అనేది నిర్ధారించుకోవాలి. మీరు హైవే టోల్ బూత్ లకు వెళ్ళినప్పుడు స్కానింగ్ చేస్తున్నప్పుడు ఫాస్టాగ్ సరిగ్గా పని చేయకుంటే ఇబ్బందులు తలెత్తుతాయి. అలాంటి ఫాస్ట్‌ట్యాగ్‌లను బ్లాక్ లిస్ట్‌లో చేర్చనున్నారు అధికారులు. ప్రభుత్వం అలాంటి నియమాన్ని రూపొందించింది. ఇటీవల విడుదల చేసిన పత్రికా ప్రకటన ప్రకారం, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా వదులుగా ఉన్న ఫాస్ట్ ట్యాగ్ లను బ్లాక్ లిస్ట్ చేయాలని నిర్ణయించింది. సాధారణంగా వాహనదారులు తమ ఫాస్టాగ్‌లను వాహన విండ్‌షీల్డ్‌లపై అతికించాల్సి ఉంటుంది. దీంతో టోల్‌ప్లాజాల వద్ద ఉన్న స్కానర్లు వాటిని స్కాన్ చేసేందుకు వీలుంటుంది. కానీ, కొందరు




ఉద్దేశపూర్వకంగా ఫాస్టాగ్‌లను అతికించట్లేదని గుర్తించారు అధికారులు. టోల్ గేట్లు వచ్చినప్పుడు పర్సులో నుంచి తీసి చూపిస్తున్నారు. ఇలాంటి వాటినే 'లూజ్ ఫాస్టాగ్'గా పిలుస్తారు. ఇలాంటి యూజర్ల వల్ల టోల్ పాస్ నిర్వహణ సమస్యగా మారుతోందని, ప్లాజాల వద్ద రద్దీ పెరుగుతోందని ఎన్‌హెచ్ఏఐ తెలిపింది. అంతేగాక, కొందరు టోలింగ్ వ్యవస్థను దుర్వినియోగం చేసేందుకు యత్నిస్తున్నట్లు పేర్కొంది. మీ ఫాస్ట్‌ట్యాగ్ ఖాతాలో తగినంత బ్యాలెన్స్ లేకపోతే, అది బ్లాక్‌లిస్ట్‌లోకి వెళ్ళవచ్చు. మీరు మీ ఫాస్ట్‌ట్యాగ్‌ని మీ వాహనానికి సరిగ్గా అంటించకపోతే లేదా టోల్ గేట్ల వద్ద దానిని సరిగ్గా ఉపయోగించకపోతే అది బ్లాక్‌లిస్ట్ చేయవచ్చు. అంతేకాదు.. ఫాస్ట్‌ట్యాగ్ ఖాతాను ప్రారంభించిన తర్వాత మీరు ఖ్‌జ ప్రక్రియను పూర్తి చేయకపోతే అది బ్లాక్‌లిస్ట్ చేయవచ్చు. ఎప్పుడు కూడా మీ ఫాస్టాగ్‌లో తగినంత బ్యాలెన్స్ ఉందని నిర్ధారించుకోండి. దానిని మీ వాహనానికి సరిగ్గా అతికించి టోల్ గేటు వద్ద సరిగ్గా ఉపయోగించండి. వాహన యజమానులు తమ ఫాస్ట్‌ట్యాగ్‌లను విండ్‌స్క్రీన్‌పై సరిగ్గా అతికించకపోవడం వల్ల టోల్ బూత్‌ల వద్ద రద్దీ, తప్పు ఛార్జ్‌బ్యాక్‌లు, టోలింగ్ వ్యవస్థను దుర్వినియోగం చేయడం మొదలైన వాటి ద్వారా ఇది మొత్తం టోలింగ్ వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. దీంతో టోల్ బూత్‌ల వద్ద వాహనాలు ఆలస్యం అవుతున్నాయని, దీనివల్ల ఇతర హైవే వినియోగదారులకు అసౌకర్యం కలుగుతుందని గమనించినట్లు ఒక ప్రకటనలో తెలిపింది. వాహన రకాన్ని బట్టి ఫాస్ట్‌ట్యాగ్‌లు మారుతూ ఉంటాయి. పెద్ద వాహనాలకు వేర్వేరు ఫాస్ట్‌ట్యాగ్‌లు ఉంటాయి.

# ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్ విడుదల.. నెంబర్ వన్ బ్యాట్స్‌మెన్‌గా జో రూట్

ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్‌ను బుధవారం విడుదల చేసింది. ఇంగ్లండ్ స్టార్ బ్యాట్స్‌మెన్ జో రూట్ ఐసీసీ నెంబర్ వన్ బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు. ఇక టాప్ టెన్‌లో ముగ్గురు భారత ఆటగాళ్లు ఉన్నారు. లార్డ్స్ టెస్టులో వీరోచితంగా పోరాటం చేసిన ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా 34వ స్థానానికి చేరుకున్నాడు. లార్డ్స్‌లో భారత్‌తో జరిగిన మూడో మ్యాచ్‌లో ఇంగ్లండ్ 22 పరుగుల తేడాతో గెలిచింది. ఈ మ్యాచ్‌లో ఇంగ్లిష్ ప్లేయర్ జో రూట్ తొలి ఇన్నింగ్స్‌లో 104, రెండో ఇన్నింగ్స్‌లో 40 పరుగులు చేయడంతో టెస్ట్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరుకున్నాడు. ప్రస్తుతం అతని ఖాతాలో 888 పాయింట్లు ఉన్నారు. ఇక మరో ఇంగ్లండ్ ప్లేయర్ హ్యారీ బ్రూక్ రెండుస్థానాలు దిగజారి మూడోస్థానానికి పడిపోయాడు. న్యూజిలాండ్ సీనియర్ ప్లేయర్ కేన్ విలియమన్స్ రెండోస్థానంలో ఉన్నాడు. ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్ నాలుగో స్థానంలో ఉన్నాడు. ఇక టీమిండియా యువ ఆటగాడు యశస్వి జైస్వాల్ ఒక స్థానం దిగజారి ఐదోస్థానానికి చేరుకున్నాడు. సౌతాఫ్రికా కెప్టెన్ టెంబా బావుమా ఆరు, శ్రీలంక ప్లేయర్ కమిందు మెండిస్ ఏడు, టీమిండియా వైస్ కెప్టెన్ రిషబ్ పంత్ ఎనిమిది, కెప్టెన్



శుభ్‌మన్ గిల్ తొమ్మిదో స్థానాల్లో ఉన్నారు. పంత్ ఒక స్థానం, గిల్ మూడుస్థానాలు దిగజారాడు. ఇక పదో స్థానంలో ఇంగ్లండ్ ప్లేయర్ జేమీ స్మిత్ పదో స్థానంలో నిలిచాడు. అయితే, లార్డ్స్‌లో 72 పరుగులు, 61 నాటౌట్‌గా నిలిచిన జడేజా ఐదు స్థానాలు ఎగబాకి 34వ స్థానానికి చేరుకున్నాడు. ఇదే మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో 100, సెకండ్ ఇన్నింగ్స్‌లో 39 పరుగులు చేసిన కేఎల్ రాహుల్ కూడా ఐదు స్థానాలు ఎగబాకి 35వ స్థానంలో ఉన్నాడు. లార్డ్స్‌లో ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ 77 పరుగులకు ఐదు వికెట్లు సాధించి, బ్యాట్స్‌మెన్‌లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గెలువడంతో రెండుస్థానాలు ఎగబాకి 42వ స్థానానికి చేరుకున్నాడు. ఇక బౌలర్ల ర్యాంకింగ్స్ టీమిండియా మిస్టరీ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా నెంబర్ వన్ బౌలర్‌గా కొనసాగుతున్నాడు. ప్రస్తుతం బుమ్రా ఖాతాలో 901 పాయింట్లు ఉన్నాయి. ఇక దక్షిణాఫ్రికాకు చెందిన కగిసో రబాడా రెండోస్థానంలో కొనసాగుతున్నాడు. ఆస్ట్రేలియన్ ఫాస్ట్ బౌలర్ స్కాట్ బోలాండ్ గణనీయంగా ఎగబాకి ఆరు స్థానాలు ఎగబాకి కెరీర్‌లో అత్యుత్తమంగా ఆరో స్థానానికి చేరుకున్నాడు. జటెస్ట్ క్రికెట్‌లో 62 వికెట్లు 16.53 సగటుతో వికెట్లు తీసిన బోలాండ్.. ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమర్స్ జార్జ్ లోహ్మన్, సిడ్నీ బార్న్స్ మాత్రమే మెరుగైన సగటుతో వికెట్లు పడగొట్టారు. ఇప్పటికే టాప్-10లో ఆస్ట్రేలియా ప్లేయర్లు పాట్ కమ్మిన్స్, జోష్ హాజిల్‌వుడ్, నాథన్ లియాన్, మిచెల్ స్టార్క్‌లతో ఐసీసీ ర్యాంకింగ్స్ టాప్ టెన్‌లో చోటు దక్కించుకున్నాడు. 1958లో ఇంగ్లండ్ జట్టు టాప్ 12లో ఆరుగురు బౌలర్లు ఉండగా.. తాజాగా ఐదుగురు ఆస్ట్రేలియా బౌలర్లు ఐసీసీ ర్యాంకింగ్స్‌లో చోటు దక్కించుకున్నారు. ఇక టీమిండియా ఆల్ రౌండర్ వాషింగ్టన్ సుందర్ 58వ స్థానం నుంచి 46వ స్థానానికి చేరుకున్నాడు.


# అతడి ఆటిట్యూడ్ వల్లే టీమిండియా ఓడిపోయింది

లార్డ్స్ వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన మూడో టెస్టులో 22 పరుగుల తేడాతో టీమిండియా ఓటమి పాలైన సంగతి తెలిసిందే. ఆఖరి వరకు రవీంద్ర జడేజా పోరాడినప్పటికి జట్టును గెలిపించలేకపోయాడు. 193 పరుగల స్వల్ప లక్ష్యాన్ని చేధించలేక భారత్ ఓటమి పాలైంది. ఈ ఓటమిపై తాజాగా భారత మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ఈ మ్యాచ్‌లో భారత్ ఓటమికి కెప్టెన్ శుబ్‌మన్ గిల్ ఆటిట్యూడ్ కూడా ఓ కారణమని కైఫ్ అభిప్రాయపడ్డాడు. కాగా లార్డ్స్ టెస్టులో గిల్ కాస్త దూకుడుగా వ్యవహరించాడు. మూడో రోజు ఆట ఆఖరిలో ఇంగ్లండ్ ఓపెనర్ జాక్ క్రాలీని పరుష పదజాలంతో గిల్ దూషించాడు. సమయాన్ని వృథా చేసేందుకు క్రాలీ ప్రయత్నించడంతో గిల్ తన సహనాన్ని కోల్పోయి వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో చాలా మంది మాజీలు గిల్ ప్రవర్తనను తప్పు బట్టారు. తాజాగా ఈ జాబితాలోకి కైఫ్ కూడా చేరాడు. "జాక్ క్రాలీతో శుబ్‌మన్ గిల్ గొడవ పడడం ఇంగ్లండ్ జట్టులో గెలవాలనే కసిని మరింత పెంచింది. ఎడ్జ్‌బాస్టన్‌లో జరిగిన రెండో టెస్టులో ఇంగ్లండ్ ఘోర ఓటమి తర్వాత వారి బ్యాటింగ్, బౌలింగ్, స్టోక్స్ కెప్టెన్సీపై విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో ఇంగ్లండ్ కూడా కాస్త డిఫెండ్‌లో పడింది. ఆ సమయంలో వారిని రెచ్చగొట్టాల్సిన అవసరం లేదు. మన వ్యూహాలను సరిగ్గా అమలు చేసుకుని ముందుకు వెళ్తే సరిపోతుంది. కానీ గిల్ మాత్రం అనవసరంగా క్రాలీతో



గొడవపడ్డాడు. ఈ సంఘటనను ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ వ్యక్తిగతంగా తీసుకున్నాడు. అందుకే ఎప్పుడూ లేని విధంగా బంతితో నిప్పులు చెరిగాడు. శరీరం సహకరించకపోయినా అద్భుతమైన స్పెల్స్‌ను బౌలింగ్ చేసి తన జట్టుకు విజయాన్ని అందించాడు. గిల్ ఒక్కటే గుర్తు పెట్టుకోవాలి. అనవసర విషయాల్లో మన ఆటిట్యూడ్ చూపించడం మంచిది కాదు. ఏ విషయాల్లో దూకుడుగా వ్యహరించాలో గిల్ ముందు తెలుసుకోవాలి" అని ఎక్స్‌లో కైఫ్ రాసుకొచ్చాడు.

## ఈ పంటపై వీఏఏ, వీహెచ్ఏలకు అవగాహన



**బుచ్చినాయుడు కండ్రిగ, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 16:**
మండలంలోని వ్యవసాయ శాఖలో కొత్తగా ట్రాన్స్ఫర్ పై వచ్చినా వీఏఏ, వీహెచ్ఏలకు పంటకోత ప్రయోగాలు మరియు ఈ పంట మీద ఏఎస్ఓ సమక్షంలో మండల అగ్రికల్చర్ ఆఫీసు ఆధ్వర్యంలో మండల వ్యవసాయ శాఖ అధికారి షణ్ముగం బుధవారం శిక్షణ ఇవ్వ డం జరిగినది.. ఈ కార్యక్రమశిక్షణకు గ్రామ వ్యవసాయ సహాయకులు గ్రామ ఉద్యాన సహాయకులు, వ్యవసాయ విస్తరణ అధికారి కె.రేవతి మండల వ్యవసాయ అధికారి కే షణ్ముగం ఏఎస్ఓ రమేష్ ముఖ్య అతిథులుగా పాల్గొనడం జరిగినది.

## ఘనంగా సీతారాముల కళ్యాణం ఉత్సవం



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జులై 16:**
చౌడేపల్లి మండలంలోని దిగువపల్లి పంచాయతీ కోలింపల్లిలో సీతారాముల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నారాయణప్ప ఆధ్వర్యంలో అభయాంజనేయస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా సీతారాములకు వేద పండితులు సత్యనారాయణ శర్మసాంప్రదాయ పద్ధంగా వివాహం నిర్వహించారు. అనంతరం గానకచేరి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై 16**



రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఎస్ఐ నాగేశ్వరరావు అన్నారు బుధవారం చౌడేపల్లి పుంగనూరు ప్రధాన రహదారిలో బోయకొండ ఆర్చి వద్ద వాహనాల తనిఖీని నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలి అన్నారు. ఆటోలలో ఓవర్లు వేరాదన్నారు, మద్యం సేవించి వాహనాలను నడపరాదన్నారు. ఎవరైనా అతిక్రమిస్తే కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143